క్లుప్తంగా

పేదలకు వరంగా సీఎం సహాయ నిధి



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాంపురంలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రాంపురం గ్రామానికి చెందిన గంజి మహాదేవి, రచ్చుమర్రి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ఎమ్మెల్యే వినతి మేరకు బాధితులకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత



రైతులతో ముచ్చటిస్తున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం : శ్రీరాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు రైతులు పశుగ్రాసాన్ని అందజేశారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి తాలూకా భాగ్యనగర్ నగరం క్యాంప్‌నకు చెందిన రైతులు 40 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి రైతులను ఆశీర్వదించారు. ఏటా గ్రామానికి చెందిన రైతులు గోశాలకు పశుగ్రాసాన్ని అందజేయడం అభినందనీయమన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, కారును చూపుతున్న పోలీసులు

మంత్రాలయం : ఏపీ 21బీఈ1599 కారులో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎరిసావలి, ఎస్‌ఐ వేణుగోపాల్ రాజ్ తెలిపారు. శుక్రవారం మంత్రాలయం సమీపంలోని గోశాల నుంచి కారు వెళ్తుండగా తనిఖీ చేయగా.. 17 బాక్స్‌ల్లో 1,632 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు లభించాయన్నారు. దేవనకొండ మండలం పి.కొటకొండ గ్రామానికి చెందిన అగ్రహారం చెన్నకేశవులును అరెస్ట్ చేయగా వెంకటేష్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచగా 14రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు వివరించారు.

విద్యుత్ బకాయిలను వసూలు చేయండి



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి

ఆదోనిఅర్బన్: డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ ఉమాపతి అన్నారు. శుక్రవారం స్థానిక డీఈ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల కొత్త విద్యుత్ కనెక్షన్ల దరఖాస్తులను పరిశీలించి వెంటనే అందించాలన్నారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. సమావేశంలో ఆదోని ఇన్‌చార్జి డీఈ రాజేష్, ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగభూషణం, డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని పరిపాలన అధికారి సత్యన్న పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ తులసీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులకు వైద్యులు వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. వైద్యులు, కార్యదర్శులు అబ్దుల్ వాహిద్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా నంది ఉత్సవం

హొళగుంద: సిద్ధేశ్వరస్వామి జాతర పురస్కరించుకుని శుక్రవారం రాత్రి హొళగుందలో నంది ఉత్సవం ఘనంగా జరిగింది. ఉచ్చాయంలో ప్రతిష్టించిన నంది విగ్రహంపై సిద్ధప్ప, సిద్ధమ్మ ఉత్సవమూర్తులనుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తేరు బజారులో ఉచ్చాయాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు.

తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



[…] కాలేజీలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

ఆదోనిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. శుక్రవారం ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పార్కింగ్‌ను ఆయన పరిశీలించారు. దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ప్రాధాన్యత క్రమంలో సామగ్రి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను సబ్‌కలెక్టర్ ఆదేశించారు. అలాగే పోలింగ్ మెటీరియల్, స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసుకునిరావడానికి, పోలింగ్ సిబ్బందిని ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కించేందుకు అవసరమైన సెక్యూరిటీ సిబ్బందిని డీఎస్పీతో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్నికల సామగ్రి స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టిన తర్వాత ఎవరూ ప్రవేశించకుండా సీలింగ్ చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే సమయంలో ఇతరులు లోపలికి రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం పోలింగ్ సామగ్రితో సిబ్బంది వెళ్లే బస్సులు మాత్రమే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అనంతరం పట్టణంలోని పోస్టల్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, కొడల్‌పేట, సాదాపురంలో ఉన్న 128, 129, 130, 131, 132, 247, 248, 196, 197, 198, 173, 174, 170, 171 పోలింగ్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తాగునీరు, విద్యుత్ టాయిలెట్స్ పక్కాగా ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, మండల సర్వేయర్ రమణ, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ చేతనప్రియ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించామని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పా



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ర్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులు, రాజకీయ పార్టీలు సూచించిన ఫిర్యాదులు, పత్రికల్లో వచ్చిన వ్యతిరేక వార్తలను పరిగణనలోకి తీసుకొని ఓటర్ల తుది జాబితాను రూపొందించామని వివరించారు. ఓటరు జాబితాపై ఏదైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సచించారు. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారం తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్, రాంప్ తదితర సదుపాయాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్ హసీనాసుల్తానాను ఆదేశించారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం

- లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోనిరూరల్: సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పిలుపునిచ్చారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పీసీపీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో భ్రూణ హత్యలు నివారించడం, పీసీపీఎన్డీడీ చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్ల యజమానులు, గైనకాలజిస్ట్ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.50 వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. పీసీపీఎన్డీటీ చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న 48 స్కానింగ్ కేంద్రాలను ప్రతి నెలా తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్‌లు, రెన్యూవల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ కేంద్రాల అనుమతులు రద్దు చేస్తామన్నారు. సమావేశంలో ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, మాధవిలత, మెడికల్ సూపరింటెండెంట్ ప్రమీల, డిస్ట్రిక్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుడి కల్యాణోత్సవం

మద్దికెర: పెరవలి గ్రామంలో శుక్రవారం రథసప్తమి పురస్కరించుకొని శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రదక్షిణలు చేసి బిందెసేవ, అష్టోత్తరనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణమండపంలో కొలువుతీరిన స్వామివార్లకు వేద పండితుల మంత్రోచ్చరణలు, భక్తాదుల మధ్య కల్యాణం నిర్వహించారు. సాయంత్రం రథసప్తమి కోసం ప్రత్యేకంగా తయారుచేయించిన సూర్యప్రభపై గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, సర్పంచ్ కారుమంచి మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

చిప్పగిరి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మూడు గడ్డివాములు కాలిబూడిదైన సంఘటన మండలంలోని ఏరూరు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నరసింహులు, అనిల్ పశువుల మేత కోసం కల్లంలో గడ్డివాములు వేసుకున్నారు. శుక్రవారం గడ్డివాములకు నిప్పంటుకోవడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వాహనంతో వచ్చి నీటిని చల్లి మంటలను అదుపుచేశారు. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోయారు.

బుడగ జంగాల సమస్యలను పరిష్కరించాలి



మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగాల కులస్తులు

ఆలూరు: ఊరూరా తిరుగుతూ చిరువ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే తమకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని బుడగ జంగాల కులస్తులు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందజేశారు. మంత్రి జయరాం మాట్లాడుతూ.. బుడగజంగాల సమస్యలపై శాసన సభలో చర్చించామని, త్వరలోనే ఆ కులస్తులకు న్యాయం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'సిద్ధం' సభను విజయవంతం చేయండి



దేవనకొండలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున

ఆలూరు: ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సీనియర్ నాయకులు కార్యకర్తలను సమాయత్తం చేయాలని, అందరికీ రవాణా సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.

దేవనకొండ: ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లాలోని రాప్తాడు నియోజకవర్గంలో జరిగే 'సిద్ధం' సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కప్పట్రాళ్ల మల్లికార్జున పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని నాయకులు, కార్యకర్తలతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి మండలం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ తపాల శ్రీనివాసులునాయుడు, పాలకుర్తి ప్రతాప్, వెలమకూరు రామచంద్ర, పల్లెదొడ్డి చంద్ర, ఉరుకుంద, లింగన్న, వెంకటస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

18 వరకు రాజ్య పురస్కార్ శిబిరం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 18వ తేదీ వరకు రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపు జరగనుంది. ఈ శిబిరానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి 9 నవోదయ విద్యాలయాల భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు 98 మంది హాజరయ్యారు. శుక్రవారం విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి ఆధ్వర్యంలో శిబిరం ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బీఆర్.బసిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్ వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలు పెపొందుతాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు చేసే సేవా కార్యక్రమాల్లో భారత్ స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులు పాల్గొని సేవ చేయవచ్చునని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ చంధీరన్, స్కౌట్ మాస్టర్ నింబూరె, గైడ్ కెప్టెన్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు

ఆలూరు రూరల్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రంగమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు త్వరగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. వేసవిలో కరెంటు కోతలు లేకుండా చూడాలన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. వైస్ ఎంపీపీ శ్రీరాములు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

భక్తుల కొంగు బంగారం 'హొళగుంద సిద్ధేశ్వరస్వామి'

హొళగుంద: కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న హొళగుంద సిద్ధేశ్వర స్వామి జాతర మూడు రోజుల పాటు ఘనంగా జరగనుంది. ఉత్సవాల్లో భాగంగా శనివారం కంకణధారణ నిర్వహించనున్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే గాక కర్ణాటక, ఇతర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

ఉత్సవ వివరాలు

ఇప్పటికే ఈ నెల 13న కంకణధారణ, 16న నంది ఉచ్చాయాలు జరిగాయి. 17న గజోత్సవం, 18న రథోత్సవం, 19న లంకాదహనం, 20న వసంతోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివన్నగౌడ, సిద్ధార్థగౌడ్ తెలిపారు. దాతల సహకారంతో అన్నదానం చేస్తారు.

అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న గడినాడ కన్నడ కళా యువ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కళాకారులతో ' రైత అచ్చిద రక్త సిందూరా' అనే కన్నడ సామాజిక నాటకాన్ని ప్రదర్శించనున్నారు. అంతకుముందు రోజు 18న వీర అభిమన్యు కాళగ, 20న కర్ణార్జునర కాళగ బయలు నాటకాలు ప్రదర్శించనున్నారు. ఉత్సవాల్లో రూ.లక్షలు విలువ చేసే రకరకాల బాణసంచా కాలుస్తారు.

రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలి





పాండవగల్ బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు, ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ఆదోనిరూరల్: పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని శుక్రవారం తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. ఆదోనిలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి వైఎస్సార్ విగ్రహం మీదుగా భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. భీమాస్ సర్కిల్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేశులు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలు అవలంభిస్తూ కార్మికులు, రైతులనుతీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరపై చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రైతుల రుణ మాఫీ చేయాలని, లేబర్ కోడ్‌లు ఎత్తివేయాలని, స్కీం వర్కర్లకు న్యాయం చేయాలన్నారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.అజయ్‌బాబు, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి వెంకప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, సీపీఐ, సీపీఎం నాయకులు సుదర్శన్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని కాపాడుకుందాం

కౌతాళం: కార్పొరేట్ వర్గం నుంచి రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వామపక్షాల నాయకులు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ, రైతాంగంపై ముళ్ల బుల్లెట్లు కురిపిస్తున్న వైఖరిని నిరసిస్తూ గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన బంద్ నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ, అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, రైతు కూలీ సంఘం కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలుపరచడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. రైతుసంఘం మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు ఉలిగయ్య, రామలింగ, వెంకటేష్, రామాంజనేయులు, హనుమంతు, నాగేంద్ర, రమేష్, చంద్ర పాల్గొన్నారు.

కోసిగి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. రైతు సంఘం నాయకులు వీరేష్, గోపాల్, రాముడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికులకు, రైతులకు అన్నీ వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ నాయకురాలు మద్దమ్మ, నాగరత్నమ్మ, సువర్ణలత, భీమలింగమ్మ, ఆశా వర్కర్లు వెంకటమ్మ, సుజాత, సంధ్య, మంజుల, గాయత్రి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల మధ్య తరగతి జీవితాలు నేడు రోడ్డున పడ్డాయని వామపక్షాల నాయకులు తిక్కన్న, పరమేష్, వీరేష్, మబ్బు ఆంజనేయ మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్ ప్రశాంతంగా ముగిసింది. వామపక్షాల ఆధ్వర్యంలో గ్రామంలోని హోటళ్లు, దుకానాలు, ప్రభుత్వ కార్యాలయాలను మూయించారు. వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు జాఫర్ పటేల్, చంద్ర, వీరేష్, హనుమంతు, ఈరన్న పాల్గొన్నారు.

రేపు పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్టాపన

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నపెండేకల్ గ్రామంలో పెద్దమ్మవ్వ విగ్రహ ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు శుక్రవారం తెలిపారు. పెద్దమ్మవ్వ విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభం, కలశం, పాదం ప్రతిష్ట, సింహవాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి ఆగమ సలహాశాస్త్రి శతాబ్ది పంచాంగకర్త శ్రీబుట్టే వీరభద్రశాస్త్రి దైవాజ్ఞ పండితునితో ప్రాణప్రతిష్ట కార్యక్రమం చేపడతామని తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చెట్టుకు ఉరేసుకుని యువకుడి మృతి



మృతి చెందిన మద్దిలేటి

జే.పంగులూరు: భార్యభర్తల మధ్య చోటుచేసుకున్న చిన్న వివాదం యువకుడి ఆత్మహత్యకు దారితీసింది. ఈ ఘటన జే.పంగులూరు మండల పరిధిలోని నూజిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కర్నూలు జిల్లా సీబెళగల్ మండలం కంబదహాల్ గ్రామానికి చెందిన బోయ కర్నం మద్దిలేటి (40) ఆ గ్రామంలోని 20 కుటుంబాలతో కలిసి 24 రోజుల క్రితం మిరప కోతల కోసం నూజిళ్లపల్లికి వచ్చాడు. శుక్రవారం భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. మనస్తాపంతో సమీపంలోని పొలంలో మద్దిలేటి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు.

ట్యాబ్‌లపై అవగాహన



ట్యాబ్‌లపై అవగహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ బాలాజీ

కౌతాళం: ఆదోని భీమా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామర్ బాలాజీ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ట్యాబ్ వినియోగంపై అవగాహన కల్పించారు. శుక్రారం పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, నగదు రహిత లావాదేవీల ప్రక్రియ, స్వచ్ఛత గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాల్‌దినకర్, కళశాల కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నష్టంపై శాస్త్రవేత్తల విచారణ



పెద్దకడబూరులోని ఎండిన కలింగర పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకడబూరు: నకిలీ విత్తనాలతో నష్ట పోయినప్పుడు పంట మధ్య దశలోనే వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకు రావాలని ఉద్యాన పరిశోదనా కేంద్రం మహానంది ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఠాగూర్‌నాయక్, జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు సూచించారు. మండల కేంద్రానికి చెందిన దాసరి శ్రీనివాసులు.. నకిలీ విత్తనాల కారణంగా తాను సాగు చేసిన కలింగర పంట నష్టపోయానని కొన్ని రోజుల క్రితం వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం శాస్త్రవేత్తలు, అధికారులు రైతు పొలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగు వివరాలు, పాటించిన యాజమాన్య పద్ధతులు, విత్తనాలకు సంబంధించిన ఆధారాలపై రైతుతో ఆరా తీశారు. వారు మాట్లాడుతూ విత్తనం మొలక, పూత, కాయ సమస్యల గురించి రైతులకు అనుమానం తలెత్తినప్పుడు అధికారులకు తెలియజేస్తే సమస్యకు గల కారణాలు అన్వేషించడం సులవవుతుందన్నారు. పూర్తిగా విశ్లేషించి నివేదిక అందజేస్తామని చెప్పారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బాలవర్ధి రాజు, మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, ఉద్యాన శాఖాధికారి హరీంద్ర, వ్యవసాయ సహాయకులు ఇందు, శ్వేత, రైతులు పాల్గొన్నారు.

జాతరకు ముమ్మర ఏర్పాట్లు

హొళగుంద: ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే హొళగుంద సిద్ధేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతితో కలిసి ఆలయ పరిసరాలు, తేరుబజారులో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, రథం సాఫీగా సాగేందుకు నేల చదును పనులు చేపట్టారు. పారిశుద్ధ్యం లోపించకుండా ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.